సాక్షి
రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 19 । మార్చి । 2023



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

వేములవాడరూరల్ : సెర్ఫ్ ఉద్యోగులకు ప్రభుత్వం పేస్కేల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేయడంతో సీఎం కేసీఆర్ చిత్రపటానికి వారు క్షీరాభిషేకం చేశారు.



దళితబంధులో ఎలక్ట్రికల్‌షాప్

గంభీరావుపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రంగంపేటలో దళితబంధులో ఏర్పాటుచేసిన ఎలక్ట్రికల్‌షాప్‌ను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య ప్రారంభించారు.

గరిష్టం/కనిష్టం
26.0/19.0

వాతావరణం

జిల్లాలో వాతావరణం చల్లగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఎక్కువగా ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పల్లెప్రగతితో మారిన రూపురేఖలు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట(వేములవాడ): పల్లెప్రగతితో గ్రామాల రూపురేఖలు మారిపోతున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. కోనరావుపేటలో ఏర్పాటుచేసిన స్వచ్ఛభారత్ మిషన్ ఫేజ్–2 మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. అరుణ మాట్లాడుతూ పల్లెప్రగతి, హరితహారం ద్వారా గ్రామాల్లో వైకుంఠధామం, డంపింగ్‌యార్డు, గ్రామీణ క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితో జిల్లాకు జాతీయస్థాయిలో అవార్డు దక్కిందన్నారు. ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, సర్పంచులు పోకల రేఖ, సంతోశ్, ఆరె లత, ఎంపీటీసీలు చారి, ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణ, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ సురేశ్, ఏపీవో శ్రీనివాస్, ఏపీఎం దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల సముదాయాలకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న చైర్మన్ సల్మాన్‌రెడ్డి

వేములవాడఅర్బన్: నాంపల్లి పీఏసీఎస్ భూమిలో కరీంనగర్–సిరిసిల్ల రోడ్డును ఆనుకుని దుకాణాల సముదాయల నిర్మాణానికి చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి శనివారం భూమిపూజ చేశారు. అనుపురంలోనూ గోదాం నిర్మాణానికి భూమిపూజ చేశారు. జెడ్పీటీసీ మ్యాకల రవి, సర్పంచ్ కొండపల్లి వెంకటరమణారావు, డైరెక్టర్లు కాశ శ్రీనివాస్, నాగరాజు, జడల రవి, చిలివేరి సత్తయ్య, నాయకులు జడల శ్రీనివాస్, నీలం శేఖర్ తదితరులు ఉన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి



గీతానగర్ స్కూల్‌లో మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉంటూ, ఉపాధ్యాయులు బోధించే అంశాలపై దృష్టి పెట్టాలని డీఈవో రమేశ్‌కుమార్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్, శివనగర్ ఉన్నత పాఠశాలలను శనివారం తనిఖీ చేశారు. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులకు డీఈవో పెన్నులు అందించారు. ఎంఈవో దూస రఘుపతి, హెచ్‌ఎం భాగ్యరేఖ, చైర్మన్ కోడం శ్రీధర్, ఉపాధ్యాయులు పాతూరి మహేందర్‌రెడ్డి, శంకర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

నేడు 'దగ్ధ హృదయం' కవితాసంపుటి ఆవిష్కరణ

సిరిసిల్లకల్చరల్: జిల్లాకు చెందిన కవి నేరోజు రమేశ్ రచించి, వెలువరించిన 'దగ్ధ హృదయం' కవితా సంపుటిని ఆదివారం ఆవిష్కరించనున్నట్లు సిరిసిల్ల సాహితీ సమితి ప్రతినిధి జనపాల శంకరయ్య తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనంలో జరిగే ఈ పుస్తకావిష్కరణకు ముఖ్య అతిథిగా సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ప్రధాన వక్తలుగా కవులు గంగ్ర లక్ష్మణ్‌రావు, తైదల అంజయ్య హాజరు కానున్నట్లు తెలిపారు.

క్రీడా శిక్షకులకు ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: వివిధ రకాల క్రీడల్లో శిక్షణనిచ్చే ఆసక్తి, అనుభవం గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఉపేందర్‌రావు శనివారం ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, బాస్కెట్‌బాల్, ఆర్చరీ, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, సైక్లింగ్, బ్యాడ్మింటన్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బిలియర్డ్స్, స్నూకర్, యోగాల్లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పతకాలు సాధించిన వారు, ఆయా అంశాల్లో డిప్లొమా చేసిన వారు, కనీసం ఆరు వారాల శిక్షణ పూర్తి చేసిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఈనెల 24వ తేదీలోపు కలెక్టరేట్‌లోని 19వ గదిలో తమ దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

సండే స్పెషల్

మన బలగం

- వెండితెరపై మెరిసిన సిరిసిల్ల పల్లెలు
- సినిమా ఆసాంతం ఇక్కడే చిత్రీకరణ
- నటనలో ఆకట్టుకున్న స్థానికులు
- కన్నీరు పెట్టించిన 'పక్షి' సన్నివేశం

సిరిసిల్ల: ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దూరమైన నేటి రోజుల్లో మానవ సంబంధాలను గొప్పగా ఆవిష్కరించి అందరితోనూ కన్నీరు పెట్టించిన బలగం సినిమా రాజన్న సిరిసిల్ల జిల్లా పరిసరాల్లో చిత్రీకరించుకుంది. సిరిసిల్ల జిల్లాకేంద్రానికి చెందిన యెల్దండి వేణు కమెడియన్‌గా సుపరిచితుడు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన బలగం సినిమా నిండా ఇక్కడి పల్లెలు.. స్థానికులే నటించారు.

సినిమా బృందంతో దర్శకుడు యెల్దండి వేణు



ఆత్మీయతల కలయిక..

తల్లికి పుట్టి, పిల్లలుగా ఉన్నప్పుడు కలిసి మెలిసి ప్రాణంగా బతికిన అన్నాదమ్ముళ్లు, అక్కాచెల్లెళ్లు పెద్దవాళ్లై పెళ్లి అవగానే చిన్నచిన్న విషయాలు, ఆస్తి తగాదాలకు కోపాలు పెంచుకుని.. హద్దులు గీసుకుని ఏళ్లకేళ్లు బతుకుతుంటారు. ఈ సినిమాలో ఇంటికొచ్చిన అల్లుడికి విలువ ఇవ్వడం లేదని, 'పూలుగ బొక్క'తో మొదలైన పంచాయితీ 20ఏళ్లు కూతురును తల్లిగారింటికి దూరం చేసింది. తన చెల్లిపై ప్రేమ ఉన్నా బావపై కోపంతో ప్రేమను అణచివేసుకుని మనసులో దుఃఖించిన వైనం గుండెలను హత్తుకుంటుంది. ప్రాణంపోయిన వ్యక్తికి పక్షికి పెడితే.. చనిపోయిన మనిషికి తృప్తి ఆ మటన్, చికెన్‌లో కాదు.. మానవ సంబంధాల్లో ఉంటుందని పక్షి ముట్టని వైనాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. కొడుకులు, కూతురు కలిశాకే పక్షి ముట్టిన తీరు కన్నీరు పెట్టిస్తుంది.

సిరిసిల్ల చుట్టే సినిమా..

'బలగం' సినిమా షూటింగ్ 70శాతం సిరిసిల్ల చుట్టూనే సాగింది. సినిమాలో కనిపించే పెద్ద ఇల్లు కోనరావుపేట మండలం కొలనూర్‌లోనిది. కల్లు మండువ ధర్మారం, శవ ఊరేగింపు కనగర్తి, గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేట, పక్షికి పెట్టే చోటు ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద చిత్రీకరించారు. తంగళ్లపల్లి, జిల్లెల్ల, సిరిసిల్ల శివారులోని జగ్గారావుపల్లె, సర్దాపూర్, కోనరావుపేట మండలం నాగారం, సుద్దాల గ్రామాల్లో షూటింగ్ చేశారు. చంద్రంపేట, జగ్గారావుపల్లె డప్పు కళాకారులు నృత్యాలు చేశారు. మానేరు వాగు, కోనరావుపేటలోని మూలవాగులోనూ సన్నివేశాలు చిత్రీకరించారు.



కోనరావుపేట మండలం కొలనూర్‌లోని ఇల్లు



సిరిసిల్లకు సినిమాకు వచ్చిన వృద్ధులు



సిరిసిల్లలో 'బలగం' ప్రీ రిలీజ్ ఫంక్షన్

అందరూ స్థానికులే..

సినిమాలో యెల్దండి వేణు, డాక్టర్ వడ్డెపల్లి కృష్ణ (సినీ పాటల రచయిత), కీసరి నర్సింగం(నాగారం), పోరండ్ల మురళీధర్ (మాజీ సర్పంచ్ జిల్లెల్ల), ఆకునూరి దేవయ్య(గాయకుడు), జీఎల్.నాందేవ్(సంగీత దర్శకులు), కాయితి బాలు (సామాజిక వేత్త), నక్క శ్రీకాంత్ (గాయకుడు), బొడ్డు భాస్కర్, డి.సంజీవ్ (గాయకుడు), విద్యాసాగర్, రవి, కాయితి మిథున్, కాయితి శశాంక్, కాయితి కనకవ్వ, యాపిల్, కల్యాడపు రిత్విక్, కౌశిక్, పావని, మనస్విని నటించారు. ఇంకా సినిమాలో కనిపించే సైడ్ క్యారెక్టర్లు కూడా జిల్లా వాసులే.

ఇది నా డ్రీమ్ ప్రాజెక్టు..



సిరిసిల్లలో కూరగాయలు అమ్మిన నేను.. సినిమాలో నటుడిని కావాలనే కసితో హైదరాబాద్ వెళ్లాను. 25 ఏళ్లుగా అనేక సినిమాల్లో నటించాను. టీవీ షోల్లో పాల్గొన్నాను. కానీ మనసులో ఎక్కడో వెలితి ఉండేది. మా కుటుంబంలో జరిగిన ఘటనలు.. నాకు తెలిసిన కొన్ని అంశాలతో కథ రాసుకున్న. ఐదేళ్లుగా ఇదే పనిపై ఉన్న. ఇది నా డ్రీమ్ ప్రాజెక్టు.. సక్సెస్ చాలా సంతోషాన్ని ఇచ్చింది. **– యెల్దండి వేణు, సినీ దర్శకుడు**

నాటకాలు వేశాను



మాది హుజూరాబాద్ మండలం జూపాక. నేను బీఏ, బీఈడీ చేశాను. టీచర్‌గా పనిచేస్తూ.. కల్చరల్ విభాగానికి ఇన్‌చార్జిగా ఉన్నాను. నేను అనేక నాటకాలు వేశాను. ఇప్పటివరకు 35 సినిమాల్లో నటించాను. 'బలగం' సినిమా మంచి గుర్తింపునిచ్చింది. సంతోషంగా ఉంది. నాది ఇంకో సినిమా 'ముత్తయ్య' విడుదల కావాల్సి ఉంది. **– కేతిరి సుధాకర్‌రెడ్డి, జూపాక, హుజూరాబాద్**

లొకేషన్లు చూడడానికి వచ్చి..



మా అబ్బాయి శ్రీనివాస్ సిరిసిల్లలో అడ్వకేట్. అతనికి సినిమా దర్శకుడు వేణు స్నేహితుడు. మా ఊరులో సినిమా తీసేందుకు లొకేషన్లు చూడడానికి వచ్చి సినిమాలో నటించే అవకాశం కల్పించారు. గ్రామ సర్పంచ్ పాత్ర పోషించాను. మంచి సినిమాలో నటించడం చాలా సంతోషంగా ఉంది. **– కీసరి నర్సింగం, నాగారం**

నటించడం మొదటిసారి..



నేను నటించడం ఇదే తొలిసారి. గతంలో 'జ్యోతి', 'యమలోకంలో తెలంగాణ' వంటి సినిమాల్లో పాటలు పాడాను. గాయకుడిగా అనేక పాటలు పాడాను. కానీ సినిమాలో నటించడం తొలిసారి. మంచి సినిమాలో ఓ పాత్ర చేయడం ఆనందంగా ఉంది. వల్లు పట్టే పాత్రను ఇచ్చిన దర్శకుడు వేణుకు ధన్యవాదాలు. **– ఆకునూరి దేవయ్య, గాయకుడు, సిరిసిల్ల**

తెరపై చూసుకోవడం తొలిసారి



బలగం సినిమాలో పంచాయితీ పెద్దగా నటించడం సంతోషంగా ఉంది. సంగీత దర్శకుడిగా అనేక జానపదాలకు బాణీలు కట్టాను. ఎన్నో పాటలకు ప్రాణం పోశాను. వేణు చిత్రీకరించిన సినిమాలో నటించడం, తెరపై నన్ను నేను చూసుకోవడం, స్నేహితుల అభినందనలు సంతోషాన్ని ఇచ్చింది. **– జీఎల్.నాందేవ్, సిరిసిల్ల**

లాక్‌డౌన్ తరువాత ఇదే రికార్డు



సినిమాకు సిరిసిల్లలో కలెక్షన్లు రికార్డు స్థాయిలో వచ్చాయి. 16 రోజుల్లో రూ.22.43 లక్షలు వసూలైంది. 23వేల మంది సినిమా చూశారు. లాక్‌డౌన్ తరువాత ఇంత పెద్ద హిట్ సినిమాలు లేవు. ఇంకా హౌస్‌ఫుల్‌గానే నడుస్తోంది. పల్లెటూర్ల నుంచి చాలా మంది వచ్చి చూస్తున్నారు. నా 35 ఏళ్ల అనుభవంలో చిన్న సినిమా పెద్దహిట్ కావడం మొదటి సారి. **– కంచర్ల వెంగయ్య, థియేటర్ మేనేజర్**

సంతోషంగా ఉంది



మాది వరంగల్ జిల్లా దుగ్గొండి. మేం కళాకారులం. పాటలు పాడుతూ.. ఊరూరు తిరుగూ జీవనం సాగించేవాళ్లం. మా పాటలు విని డైరెక్టర్ వేణు మాకు అవకాశం కల్పించారు. 'బలగం' సినిమాలో పాట పాడడం చాలా సంతోషంగా ఉంది. సినిమాతో మాకు గుర్తింపు వచ్చింది. చాలా మంది మమ్మల్ని సన్మానించి, ఆర్థికంగా ఆదుకున్నారు. **– బుర్రకథ కళాకారులు కొమురవ్వ, మొగిలయ్య, దుగ్గొండి**

వడగండ్లు.. కడగండ్లు

- వెన్నువిరిగిన వరిపంట
- రాలిన మామిడికాయలు
- నేలవాలిన నువ్వు
- అన్నదాతలకు తీవ్ర నష్టం



ఈ చిత్రంలో వరిచేనును చూపిస్తున్న మహిళా రైతు రుద్రంగికి చెందిన అల్లూరి నిర్మల. ఐదున్నర ఎకరాల్లో వరి సాగు చేసింది. పంట పొట్టదశకు వచ్చిన సమయంలో వడగళ్ల వాన పడడంతో మొత్తం నేలరాలిపోయింది. ఒక్క గింజ కూడా వచ్చే పరిస్థితి లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.



ముస్తాబాద్‌లో వడగండ్లు



కోరుట్లపేటలో కురిసిన వడగండ్లు



వరిపంటను చూపుతున్న రైతు పేరు బడుగు నారాయణ. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన నారాయణ తన కున్న రెండు ఎకరాల్లో వరిపంట సాగు చేశాడు. వడగండ్ల వానకు గొలక మొత్తం విరిగిపోయింది. ఇన్నాళ్లు చీడపీడలతో ఇబ్బందిపడ్డామని.. ఇప్పుడు వడగండ్ల వానతో పంటకు తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



బోయినపల్లి: కోరెంలో నేలవాలిన నువ్వు పంట



సిరిసిల్లలోని పాతబస్టాండ్‌లో వరద ఉధృతి



బోయినపల్లిలో విరిగిన వరి గొలకలు

రుద్రంగి/వేములవాడరూరల్/బోయినపల్లి/ముస్తాబాద్/గంభీరావుపేట/ఇల్లంతకుంట: రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వాన రైతులకు కడగండ్లు మిగిల్చాయి. పొట్టదశలో ఉన్న వరిపంట చేతికందకుండా పోయింది. మామిడికాయలు నేలరాలిపోయాయి. జిల్లాలో అత్యధికంగా రుద్రంగి మండలంలో పంటలకు తీవ్ర నష్టం జరిగింది. ఈ సీజన్‌లో అధిక చలి, వాతావరణ పరిస్థితులతో వరిపంటను ఎక్కువగా చీడపీడలు ఆశించాయి. వాటి నివారణకు రైతులు రసాయనిక మందులు పిచికారీ చేశారు. పొట్టదశలో వరిపంట చేరుకున్న సమయంలో కురిసిన వడగండ్ల వానతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్ ప్రాంతంలో కురిసిన వడగళ్లతో వరిపొలాలు దెబ్బతిన్నాయి. ఫాజుల్‌నగర్‌తోపాటు నమిలిగుండుపల్లి, నూకలమర్రి ప్రాంతాల్లోనూ వడగళ్ల వాన కురిసింది. బోయినపల్లి మండలంలోని తడగొండ, బోయినపల్లి, బూర్గుపల్లి, కోరెం, దుండ్రపల్లి, మల్కాపూర్ గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. కోరెంలో నువ్వుపంట నేలవాలినట్లు రైతు డబ్బ వెంకటరెడ్డి వాపోయాడు. తడగొండలో ఆముదాల రాజిరెడ్డి వరికి తీవ్ర నష్టం జరిగింది. ముస్తాబాద్‌తోపాటు కొండాపూర్, రామ్‌రెడ్డిపల్లె, గూడెం, పోతుగల్, గన్నెవారిపల్లె, తెర్లుమద్ది గ్రామాల్లో భారీ వడగండ్లు పడ్డాయి. పొట్టదశలో ఉన్న వందలాది ఎకరాలలో వరిపంట దెబ్బతింది. గూడెం, రామ్‌రెడ్డిపల్లె, కొండాపూర్‌లలో భారీ సైజులలో ఉన్న వడగండ్ల వాన కురిసింది. గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లో ఈదురుగాలులతో కురిసిన వర్షానికి వరిపంట దెబ్బతింది. గంభీరావుపేటతోపాటు మల్లారెడ్డిపేట, దమ్మన్నపేట, గోరింటాల, పొన్నాలపల్లె, జిల్లెల్లపల్లె, ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంతోపాటు గొల్లపల్లి, కోరుట్లపేట, నారాయణపూర్ గ్రామాల్లో రాళ్ల వర్షం కురిసింది.

సిరిసిల్లలో ముంచెత్తిన వరద

సిరిసిల్లటౌన్: అకాల వర్షం జిల్లా కేంద్రం సిరిసిల్లను ముంచెత్తింది. పాతబస్టాండు ప్రాంతం వరదతో పోటెత్తింది. ఈప్రాంతంలో డ్రెయినేజీలు సరిగ్గా లేకపోవడంతో వర్షం పడిన ప్రతీసారి వరద ముంచెత్తుతోంది. లక్షలాది రూపాయలు వెచ్చించి ఇటీవల పెద్ద డ్రెయినేజీని నిర్మించారు. అయినప్పటికీ చిన్నపాటి వర్షానికే ఇలా ప్రధాన రహదారిపైకి వరద నీరు వచ్చి చేరింది. ఇల్లంతకుంట మండల వ్యాప్తంగా వడగండ్లు.. ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వరి, మొక్కజొన్న, పంటలకు నష్టం జరిగింది.

రైతులు అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో అకాల వడగండ్ల వాన పడి పంటలు నష్టపోయాయని, రైతులు అధైర్య పడొద్దని.. ప్రభుత్వం అండగా ఉంటుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. వడగండ్లతో జరిగిన పంటనష్టాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడారు. పంట నష్టం వివరాలను కలెక్టర్‌తోపాటు మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. రైతులు అధైర్యపడొద్దని.. ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తంగళ్లపల్లి మండలంలోని బాలమల్లుపల్లె, బస్వాపూర్, రామన్నపల్లి గ్రామాల్లో వడగండ్ల వాన పడింది.

సర్వే చేస్తాం

రుద్రంగి మండలంలో వడగండ్ల వాన వరిపంటకు భారీ నష్టం కలిగించింది. ఉన్నతాధికారులకు రిపోర్టు చేశాం. పంట నష్టం సర్వే చేస్తాం. రైతులకు నష్ట పరిహారం అందేలా చూస్తాం.

– వెంకటరామమ్మ, మండల ఇన్‌చార్జి ఏవో, రుద్రంగి

పేపర్ లీక్ చేసిన నిందితులను శిక్షించాలి

- మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలి
- బీజేపీ పార్లమెంట్ కార్యదర్శి ఆడెపు రవీందర్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్లటౌన్: టీఎస్‌పీఎస్సీ పేపర్లను లీక్ చేసిన నిందితులను వెంటనే శిక్షించాలని కోరుతూ శనివారం బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. బీజేపీ పార్లమెంట్ కార్యదర్శి ఆడెపు రవీందర్, పార్టీ పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులపై వివక్ష చూపుతుందన్నారు. పేపర్ల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు చేయించాలని కోరారు. నిరుద్యోగుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని పేర్కొన్నారు. వరుస లీకేజీలకు బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కవితను లిక్కర్‌స్కాంలో నుంచి తప్పించేందుకు ప్రభుత్వం అపసోపాలు పడుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, శిరస్వాల్ కైలాశ్, మ్యాన రాంప్రసాద్, ఊరగొండ రాజు పాల్గొన్నారు.

నేడు సిరిసిల్లకు షర్మిల

సిరిసిల్లటౌన్: వైఎస్సార్‌టీపీ అధినేత్రి, వైఎస్ షర్మిల ఆదివారం సిరిసిల్లకు వస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము శనివారం తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడ్డ నిరుద్యోగి చిటికెన నవీన్ కుటుంబాన్ని పరామర్శించనున్నట్లు పేర్కొన్నారు.

ఉత్తమ టీఎల్‌ఎంగా దమ్మన్నపేట ప్రదర్శన

గంభీరావుపేట(సిరిసిల్ల): భారతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి టీచింగ్, లర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎం) మేళాలో దమ్మన్నపేట జెడ్పీ ఉన్నత పాఠశాల టీచర్ సంపత్‌కుమార్ రూపొందించిన ప్రదర్శన ఉత్తమ టీఎల్ఎంగా ఎంపికైంది. ఆన్‌లైన్‌లో 45 పాఠశాలల నుంచి టీఎల్‌ఎంలు పాల్గొన్నాయి.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు



నవీన్ అంత్యక్రియల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, తదితరులు



నవీన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము

- నవీన్ అంత్యక్రియల్లో పాల్గొన్న పలు పార్టీల నాయకులు
- కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి కేటీఆర్

సిరిసిల్లటౌన్: ఉద్యోగం రావడం లేదని మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్న చిటికెన నవీన్ ఉదంతం సిరిసిల్లలో విషాదం నింపింది. నవీన్ అంత్యక్రియలు శనివారం నిర్వహించారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు నవీన్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులను వివిధ పార్టీల రాజకీయ నాయకులు పరామర్శించారు. నేత కుటుంబానికి చెందిన యువకుడి బలవన్మరణంపై రాజకీయ పార్టీల నాయకులు స్పందించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. మంత్రి కేటీఆర్ నవీన్ తండ్రి నాగభూషణంతో ఫోన్‌లో మాట్లాడారు. కుటుంబానికి అండగా ఉంటానని మనోధైర్యం ఇచ్చారు. అంత్యక్రియలు దగ్గరుండి జరిపించాలని మున్సిపల్ పాలకవర్గానికి కేటీఆర్ సూచించారు. శనివారం ఉదయం జరిగిన నవీన్ అంత్యక్రియల్లో డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు నాగుల సత్యనారాయణగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, సంగీతం శ్రీనివాస్, సూర దేవరాజు పాల్గొని నివాళి అర్పించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆదేశాలతో పార్లమెంట్ కార్యదర్శి సభ్యుడు ఆడెపు రవీందర్, రాష్ట్ర నాయకుడు లగిశెట్టి శ్రీనివాస్, శీలం రాజు, నాగుల శ్రీనివాస్ నవీన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, మ్యాన లక్ష్మీనారాయణ, వంగరి అనిల్, రవి తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

నవీన్‌ది ప్రభుత్వ హత్య : కె.కె.మహేందర్‌రెడ్డి

నవీన్‌ది ఆత్మహత్య కాదని.. ప్రభుత్వ హత్య అని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్లలో బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించిన తర్వాత విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థతతోనే నిరుద్యోగం పెరిగిందన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సిరిసిల్ల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కేటీఆర్ కనీసం పరామర్శకు కూడా రాకుండా ఫోన్‌లో మాట్లాడడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



నవీన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కె.కె.మహేందర్‌రెడ్డి

ఆకునూరి బాలరాజు, జాలుగం ప్రవీణ్, గంభీరావుపేట ప్రశాంత్, మునిగెల రాజు పాల్గొనారు.

ప్రభుత్వంపై కేసు పెట్టాలి : ఆది శ్రీనివాస్

నిరుద్యోగి నవీన్ ఆత్యహత్యకు బాధ్యతగా రాష్ట్ర సర్కారుపై కేసు పెట్టాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బాధిత కుటంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో సర్పంచులకు నిధులు లేక ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు జరుగడం శోచనీయమన్నారు. నాగుల సత్యనారాయణగౌడ్, ఆకునూరి బాలరాజు, సంగీతం శ్రీనివాస్, సూర దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



కుక్కదాడిలో గాయపడ్డ విఘ్నేశ్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని ఎగ్లాస్పూర్‌కు చెందిన నేరెళ్ల తిరుపతి–కవిత దంపతుల కుమారుడు విఘ్నేశ్(4)పై కుక్కలు దాడి చేశాయి. శనివారం సాయంత్రం ఇంటిముందు ఆడుకుంటున్న విఘ్నేశ్‌పై ఒక్కసారిగా కుక్క దాడి చేసింది. వెంటనే కోనరావుపేటలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అయితే తమ దగ్గర వ్యాక్సిన్ లేదంటూ సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి వెళ్లాలని కోనరావుపేట పీహెచ్‌సీ సిబ్బంది సూచించారు. తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతూ సిరిసిల్లకు వెళ్లి వ్యాక్సిన్ వేయించారు.

వృద్ధుల సంరక్షణ కేంద్రానికి తరలింపు



వృద్ధురాలిని తరలిస్తున్న అధికారులు

గంభీరావుపేట(సిరిసిల్ల): వీధుల్లో నిరాశ్రయురాలిగా జీవిస్తున్న మహిళలను వృద్ధుల సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం తెలిపారు. ఎల్లారెడ్డిపేటలో ఓ నిరాశ్రయులైన వృద్ధురాలు బాలల పరిరక్షణ విభాగంలో పనిచేస్తున్న న్యాయ సేవల అధికారికి కనిపించింది. వెంటనే డీడబ్ల్యూవోకు సమాచారం అందించగా.. ఆయన సఖీ కేంద్రం నిర్వాహకురాలు రోజాకు విషయం తెలిపిరాడు. వెంటనే అక్కడికి చేరుకున్న రోజా వృద్ధురాలిని ఎల్లారెడ్డిపేట వృద్ధుల సంరక్షణ కేంద్రానికి తరలించారు.

రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- బీజేపీ కౌన్సిలర్ నాగరాజు

సిరిసిల్లటౌన్: ఉద్యోగం రావడం లేదని ఆత్మహత్యకు పాల్పడ్డ నవీన్ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని బీజేపీ కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్కెం నాగరాజు కోరారు. బాధిత కుటంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

శవ రాజకీయాలు చేయొద్దు : మనోజ్

ప్రతిపక్షాలు శవ రాజకీయాలు చేయొద్దని బీఆర్‌ఎస్ యూత్ వింగ్ అధ్యక్షుడు సుంకపాక మనోజ్‌కుమార్ సూచించారు. నిరుద్యోగి నవీన్ కుటుంబాన్ని యూత్‌వింగ్ నేతలతో కలిసి పరామర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. నవీన్ తండ్రికి మంత్రి కేటీఆర్ ఫోన్ చేసి పరామర్శించారన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని చెప్పడం గమనించాలన్నారు. అనవసరపు రాద్ధాంతం చేయొద్దని కాంగ్రెస్, బీజేపీ నాయకులకు సూచించారు. కత్తెర వరుణ్ తదితరులున్నారు.

రంజాన్‌కు సౌకర్యాలు కల్పిస్తాం

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



మాట్లాడుతున్న ఖీమ్యానాయక్

సిరిసిల్ల: రంజాన్‌కు సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం అధికారులు, మైనార్టీ నాయకులతో రంజాన్ పీస్ మీటింగ్ నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మసీదులు, ఈద్గాలు, ఖబ్రస్థాన్‌ల వద్ద శుభ్రం చేయించాలన్నారు. తాగునీటి వసతి కల్పించాలని మున్సిపల్ కమిషనర్లను, జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. రాత్రి 2 నుంచి ఉదయం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా లో ఇబ్బందుల్లేకుండా చూడాలని 'సెస్' అధికారులకు సూచించారు. ట్రాఫిక్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి, సిరిసిల్ల ఆర్డీవో శ్రీనివాస్‌రావు, వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్, డీపీవో రవీందర్, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, మైనార్టీ వెల్ఫేర్ ఓఎస్‌డీ సర్వర్‌మియా, వేములవాడటౌన్ సీఐ వెంకటేశ్, సిరిసిల్ల తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్.శ్రీకాంత్‌గౌడ్, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, మైనార్టీ నాయకులు యూసుఫ్, సలీం, రీనాబాబా తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ



మాట్లాడుతున్న జడ్జి శ్రీలేఖ

సిరిసిల్లటౌన్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని సీనియర్ సివిల్‌జడ్జి శ్రీలేఖ కోరారు. సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారుల సంఘంలో శనివారం అసంఘటిత కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు, వృద్ధులు, కార్మికులు, పిల్లలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు దేశ అభ్యున్నతిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. గృహహింసకు పాల్పడే వారికి కఠిన శిక్షలు ఉన్నాయని తెలిపారు. కార్మిక చట్టాలపై లేబర్ ఆఫీసర్ మహ్మద్ రఫీ అవగాహన కల్పించారు. లోక్‌అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, న్యాయవాదులు పెంట శ్రీనివాస్, కళ్యాణి, జ్యోతి పాల్గొన్నారు.

'కులాంతర వివాహాలకు ప్రోత్సాహం'



బాండ్ అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

సిరిసిల్ల: కులాంతర వివాహాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. సిరిసిల్ల జెడ్పీ ఆఫీస్‌లో శనివారం కులాంతర వివాహం చేసుకున్న ఆరు జంటలకు రూ.2.50 లక్షల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌పత్రాలు అందించారు. అరుణ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందన్నారు. కులరహిత సమాజాన్ని స్థాపించే లక్ష్యంతో కులాంతర వివాహాలను ప్రభుత్వం ప్రో త్సహిస్తుందన్నారు. వివిధ గ్రామాలకు చెందిన ల బ్ధిదారులు ఎం.అనిల్‌కుమార్–శృతి, తుమ్మల రవీందర్–అర్చన, ఉత్తరవెల్లి దేవిప్రసాద్–అఖిల, నీరటి ప్రదీప్–ధనలక్ష్మి, దసనం రాకేశ్–అఖిల, గజ్జెల సాయికుమార్–దీపా దంపతులకు ఎఫ్‌డీ బాండ్లు అందించారు. ఎస్సీడీవో మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్లమెంట్ సాక్షిగా పచ్చి అబద్ధాలు

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్




మాట్లాడుతున్న వినోద్‌కుమార్

ఇల్లంతకుంట(మానకొండూర్): కాళేశ్వరం ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం ఏనాడు జాతీయహోదా అడగలేదని పార్లమెంటు సాక్షిగా కేంద్ర జలవనరుల శాఖ మంత్రి మాట్లాడటం దురదృష్టకరమని తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఇల్లంతకుంటలో శనివారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో కృష్ణా, గోదావరి నదులు ఎప్పుడూ ప్రవహిస్తాయని, రాష్ట్రంలోని లక్షలాది ఎకరాలకు సాగునీరందించాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే కేంద్ర ప్రభుత్వం జాతీయహోదా కల్పించకపోవడం భావ్యం కాదన్నారు. రాష్ట్ర ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ తెలంగాణలో జాతీయ ప్రాజెక్టు నిర్మించాలని కేంద్రానికి లేఖ రాసిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర మొండిచేయి చూపితే.. సీఎం కేసీఆర్ కాళేశ్వం ప్రాజెక్టును నిర్మించారన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు దమ్ముంటే కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయహోదా కల్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు మాత్రమే ప్రధాని నరేంద్రమోదీ వేలాది కోట్లు కేటాయిస్తున్నారని విమర్శించారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, వైస్‌ఎంపీపీ శ్రీనగౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ వేణురావు, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ గొడుగు తిరుపతి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య ఉన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్లయ్య



మాట్లాడుతున్న సీడీపీవో ఎల్లయ్య

చందుర్తి(వేములవాడ): చిన్నారుల్లో పోషకాల లోపాన్ని పౌష్టికాహారంతో అధిగమించవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో ఎల్లయ్య తెలిపారు. మండలంలోని మర్రిగడ్డ రైతువేదికలో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలకు చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందించాల్సిన పౌష్టికాహారంపై శిక్షణ తరగతుల ముగింపునకు సీడీపీవో ఎల్లయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వయసుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు లేక చిన్నారులు బలహీనమవుతున్నారన్నారు. వారికి పాలు, గుడ్లు అందించాలని సూచించారు. ఐదేళ్లలోపు చిన్నారుల ఎదుగుదలపై సిబ్బంది ప్రతీ నెల కొలతలు, బరువు తీయాలని సూచించారు. తల్లుల్లో రక్తహీనతతో పిల్లలు బలహీనంగా ఉంటున్నారన్నారు. పోషణ్ అభియాన్ కో–ఆర్డినేటర్ రాజ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, రమ్య, రేణుక, అయేశా, అనసూయ, మంగ, మమత, భూజ్యోతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

23 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకున్న ఎస్సైలు

ముస్తాబాద్ (సిరిసిల్ల): మండలంలోని మోహినికుంటలో 23 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శనివారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు మారుతి, పరశురాం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ..మోహినికుంట శివారులో చౌకధరల బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ బృందంతో దాడులు చేసి, కనకయ్య ఇంటి వద్ద 23 క్వింటాళ్ల బియ్యాన్ని ఆటోలో లోడు చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఆటోతోపాటు డ్రైవర్ ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసినా, ఇతర ప్రాంతాలకు తరలించినా చర్యలు తీసుకుంటామని ఎస్సైలు అన్నారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తిరుపతి, శ్రీనివాస్, అక్బర్, విజయ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం చంద్రగిరి పరిధిలోని తెట్టకుంటలో అనుమతి లేకుండా చెరువు శిఖం భూమిని ఆక్రమించుకుని నిర్మించిన భవనాన్ని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కూల్చివేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ తెలిపారు. ఈ భవనం పనులను ముందుగానే గుర్తించి పలుమార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ యజమాని పట్టించుకోలేదన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి చెరువు శిఖం పరిధిలో నిర్మాణం వస్తుందని నిర్ధారించి తొలగింపునకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో శ్రీధర్ ఆధ్వర్యంలో జేసీబీతో ఈ అక్రమ నిర్మాణాన్ని తొలగించినట్లు స్పష్టం చేశారు. గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు. నిర్మాణదారులు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్‌లోనే అనుమతులు లభిస్తాయని పేర్కొన్నారు.

మహిళల సంక్షేమానికి అండగా ప్రభుత్వం

ఇల్లంతకుంట: మహిళల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు అన్నారు. మండలంలోని అనంతారంలో 28 మహిళా సంఘాలకు రూ.2.45 లక్షల వడ్డీలేని రుణాల ప్రొసీడింగ్స్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మహిళల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, ఎంపీటీసీ పుష్పలత, ఏఎంసీ చైర్మన్ సంజీవ్, సెస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, ఇల్లంతకుంట ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య యాదవ్, ఏఎంసీ వైస్ చైర్మన్ చందన్, వీవోఏ రాజ శ్రీ, వీవో అరుణ ఉన్నారు.

కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ వేడుకలు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం కిండర్‌గార్డెన్ గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు చేసిన నృత్యాలు, పాటలు, నాటకాలు అలరించాయి. ఎం.సంతోష్ పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన పప్పెట్ షో ఆకట్టుకుంది. పాఠ్య, సహపాఠ్య కార్యక్రమాల్లో విజేతలైన విద్యార్థులకు పాఠశాల చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్ బహుమతులు అందించారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన స్తంభంపల్లి వాసులు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

బోయినపల్లి : మండలంలోని స్తంభంపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ మాదిగ సంఘ నాయకులు శనివారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. గ్రామంలో ఎస్సీ సంఘం భవనం పనులకు రూ. 3 లక్షలు నిధులు మంజూరు చేసినందకు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొట్టెపెల్లి లింగయ్య, అక్కెనపెల్లి కరుణాకర్, గంగాధర లచ్చయ్య, తిరుపతి, అక్కెనపెల్లి లక్ష్మీరాజం, రాజేశ్, లింగయ్య, అజయ్ ఉన్నారు.

శివాలయంలో ఎమ్మెల్యే పూజలు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కోరెం శివాలయంలో శనివారం నూతనంగా శ్రీ లక్ష్మీ గణపతి, సీతారామ హనుమాన్, శ్రీ రాజరాజేశ్వరి, శ్రీకృష్ణ దేవతల విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అజ్జు, గ్రామస్తులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పుస్తె, మెట్టెలు వితరణ


పుస్తెమెట్టెలు అందిస్తున్న సర్పంచ్

చందుర్తి (వేములవాడ): నిరుపేద యువతి వివాహానికి సర్పంచ్ అందించి పుస్తె, మెట్టెలను ఔదార్యం చాటుకున్నాడు. మూడపల్లికి చెందిన బైరోజు లక్ష్మీ నర్సయ్యాచారి దంపతుల రెండో కూతురు శ్రీజ ఊరఫ్ లావణ్య వివాహానికి సర్పంచ్ చిలుక అంజిబాబు హాజరై పుస్తె మెట్టెలు అందించారు. కులసంఘాల నాయకులు ఆర్థికసాయం అందించారు. నీరటి శ్రీనివాస్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

‘సఖి’ సేవలపై అవగాహన

బోయినపల్లి: మండలంలోని స్తంభంపల్లి, విలాసాగర్ గ్రామాల పాఠశాలల్లో శనివారం సఖి సేవలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సఖి సెంటర్ కౌన్సిలర్ కళావతి విద్యార్థులకు సఖి సేవలు, జెండర్ వివక్షత, పోక్సో చట్టం, మొబైల్ వాడకంతో నష్టాలు, ఫొటో ఇమేజెస్ షేరింగ్, సైబర్ క్రైమ్స్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పారా మెడికల్ ప్రవళిక, హెడ్‌మాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

ముస్తాబాద్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. మండలంలోని రామ లక్ష్మణపల్లె ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదిని శనివారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు తన సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, సర్పంచ్ దమ్మ రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ గూడ రాజిరెడ్డి, హెచ్‌ఎం ఫాతిమా, విజయరామారావు, క్రాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూమిపూజ

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్‌లో జ్యోతిరావు పూలే విగ్రహ నిర్మాణానికి ఎంపీపీ జనగామ శరత్‌రావు, ప్రజాప్రతినిధులు శనివారం భూమిపూజ నిర్వహించారు. పూలే జయంతి నాటికి విగ్రహ నిర్మాణాన్ని పూర్తి చేసి ఆవిష్కరిస్తామన్నారు. సర్పంచ్ బద్ది కల్యాణి, జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎంపీటీసీ లలిత, భాను, క్రాంతి, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు

పెండింగ్ బిల్లులుచెల్లించాలి


మాట్లాడుతున్న టీటీయూ నాయకులు

సిరిసిల్ల ఎడ్యుకేషన్ : ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఈ- కుబేర్‌లో పెండింగ్‌లో బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని టీటీయూ జిల్లా అధ్యక్షుడు కొండికొప్పుల రవి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగుల డీఏ ఏరియర్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ చెల్లింపులు, ప్రభుత్వ జీవిత బీమా చెల్లింపులను జరిగేలా చూడాలన్నారు. టీటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెడ్డిమళ్ల మాణిక్యం, జిల్లా ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి సుధాకర్ మడికంటి మల్లేశం, రాజు, అమరేందర్ పాల్గొన్నారు.

హల్దీ ఫంక్షన్స్ అదుర్స్..

- వివాహ వేడుకల్లో కొత్త ట్రెండ్
- ప్రత్యేక ఆకర్షణగా డ్రెస్ కోడ్.
- ఉత్సాహంగా పాల్గొంటున్న బంధువులు, స్నేహితులు







సండే స్పెషల్

వివాహ వేడుకల్లో హల్దీ ఫంక్షన్ వేడుకలు ఇప్పుడు కొత్త ట్రెండ్.. పెళ్లికి ఒకరోజు ముందుగా వధూవరులకు పసుపుతో మంగళ స్నానాలు చేయించడం అనాదిగా వస్తున్న ఆచారం. అయితే మంగళస్నానం అనే ఆచారం 2018 చివరి నుంచి కొత్తపుంతలు తొక్కి హల్దీఫంక్షన్స్‌గా మారి మ్యారేజ్ ఈవెంట్‌లో ప్రత్యేకంగా మారింది. పెళ్లిళ్లలో ప్రస్తుతం హల్దీ ఫంక్షన్ వేడుకలు ఎప్పుడు గుర్తుండిపోయే విధంగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. హల్దీ వెంట్‌లో పెళ్లి కూతురు, పెళ్లి కొడుకు, బంధువులు, స్నేహితులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మ్యారేజీలో ఇపుడు మంగళస్నానం మరుపురాని మధురానుభూతిని అందిస్తోంది. – బోయినపల్లి (చొప్పదండి)

హల్దీలో చెప్పలేని ఆనందం



ఇటీవల నా వివాహం జరిగింది. హల్దీ ఫంక్షన్‌లో బంధువులు, స్నేహితులు కలిసి ఒకే కలర్ డ్రెస్ కోడ్‌తో ఉత్సాహంగా పాల్గొనడం చెప్పలేని ఆనందాన్ని ఇచ్చింది. వరసైన వారు చేసే అల్లరి, కొంటె పనులతో వేడుకలు జీవితంలో మరచిపోలేని మధురానుభూతిని ఇచ్చాయి.

–నలిమెల అరవింద్, బూర్గుపల్లి

ఉత్సాహాన్నిస్తాయి



కొన్ని సంవత్సరాలుగా వివాహ వేడుకల్లో హల్దీ ఫంక్షన్ ప్రత్యేకంగా మారింది. దీంతో వేడుకల్లో ఫొటో, వీడియోగ్రాఫింగ్ ప్రాముఖ్యత సంతరించుకుంది. ఇప్పటి వరకు 80 వరకు హల్దీ ఈవెంట్స్ ఫొటో, వీడియో గ్రఫీ చేశాను. హల్దీ వేడుకల షూట్స్ కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయి.

–భూతం వీరస్వామి, ఫొటోగ్రాఫర్, బోయినపల్లి

డ్రెస్ కోడ్‌తో వేడుకలు..

హల్దీ ఫంక్షన్లలో పాల్గొనే వారు ఒకే రకమైన డ్రెస్ కోడ్‌తో వేడుకల్లో పాల్గొంటున్నారు. మగవారు మెజార్టీగా ఎల్లో (పసుపు) కలర్ లాల్చీ, తెల్లటి ప్యాంట్.. మహిళలు పసుపు కలర్ చీరెలు ధరిస్తారు. ఇంకొంతమంది మెరూన్, బ్లూ, ఆరెంజ్ తదితర రంగుల డ్రెస్సింగ్ వాడుతున్నారు. వేడుకల్లో పెళ్లి కూతురు, పెళ్లి కుమారుడికి ఎవరి ఇళ్లలో వారు వేర్వేరుగా వేడుకలు నిర్వహిస్తారు. పసుపు నీటితో మంగళస్నానం చేయిస్తారు.

కళ్లు చెదిరేలా షూట్స్..

హల్దీ ఫంక్షన్ వేడుకల్లో ఫొటో, వీడియో షూట్ క్రేజీగా మారింది. సాగే హల్దీ ఈవెంట్‌ను జీవితాంతం గుర్తుండేలా ఫొటో, వీడియో గ్రాఫర్లు వేడుకలను షూట్ చేస్తున్నారు. ఫొటో, వీడియో షూటింగ్‌లకు సైతం పెద్ద మొత్తంలో చార్జ్ చేస్తున్నారు.

రూ.10వేల నుంచి రూ.50వేల వరకు ఖర్చు

హల్దీ వేడుకల ఈవెంట్స్ కోసం ప్రత్యేక సెట్టింగ్‌లు అందుబాటులోకి వచ్చాయి. రూ.10వేల నుంచి రూ.50 వేల వరకు సెట్టింగ్‌లకు చార్జ్ చేస్తున్నట్లు ఈవెంట్స్ నిర్వాహకులు పేర్కొన్నారు. హల్దీ ఫంక్షన్‌లో పెళ్లి కూతురు కూర్చోడానికి తామరపువ్వు, పెళ్లి కుమారుడికి బాహుబలి తోఫా సెట్టింగ్ వేస్తారు. గులాబీ, మల్లె, చామంతి రకరకాల పూలతో డెకరేట్ చేస్తారు. మంగళస్నానాలకు గంగాళాలు, జల్లెడ, రాగి లేదా ఇత్తడి చెంబు వాడుతారు. కపుల్స్‌కు పసుపు రాసిన అనంతరం గంగాళంలో పూలతో ఉన్న పసుపు నీళ్లను జల్లెడ ద్వారా పోసి చిరుజల్లులతో మంగళస్నానం చేయిస్తారు.

అదిరిపోయేలా సెట్టింగ్స్



పెళ్లి వేడుకల్లో హల్దీ ఫంక్షన్ సెట్టింగులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వేడుకలకు ప్రత్యేక అందం తెచ్చేలా సెట్టింగులు వేస్తున్నాం. గ్రామాల్లో హల్దీ ఫంక్షన్ సెట్టింగ్‌కు రూ.10వేల నుంచి రూ. 15 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. పట్టణాల్లో హల్దీ వేడుకల సెట్టింగులు రూ. 20వేల నుంచి రూ.50 వేల వరకు ఉంటుంది. ఇప్పటి వరకు సుమారు 60 వరకు హల్దీ సెట్టింగులు వేశాం.

–పెరుక మహేశ్, శ్రీ దుర్గా ఈవెంట్స్, బూర్గుపల్లి

ప్రత్యేక ఆకర్షణగా హల్దీ వేడుకలు



మా అల్లుడి పెళ్లిలో హల్దీ ఫంక్షన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.పెళ్లి కొడుకుకు పసుపు రాసి.. బంధువులు, స్నేహితులు అందరూ పసుపు రాసుకొని మంగళస్నానం చేయించడం మరపురాని అనుభూతి. కొందరు బిందెలతో నీళ్ల పోయడం.. మొత్తం ఫంక్షన్‌లో ఎంజాయ్‌మెంట్.. హంగామా.. హుషారుగా గడిచింది.

–దూస రాము, బోయినపల్లి

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని జడ్పీ చైర్‌పర్సన్‌కు వినతి


జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న హనుమాన్ దీక్షాపరులు

కోనరావుపేట: మండల కేంద్రంలోని దుబ్బ ఆంజనేయస్వామి ఆలయం వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని హనుమాన్ దీక్షాపరులు కోరారు. ఈ మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణకు వినతిపత్రం అందజేశారు. త్వరలోనే లైట్లను ఏర్పాటు చేయిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. ఇక్కడ జిల్లా సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శి మంతెన సంతోష్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు గంగసాని రమణారెడ్డి, మండల నాయకులు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, చంద్రారెడ్డి, ఎలయ్య, నాగరాజు, కాసర్ల రాజు, గుండా రామచంద్రం తదితరులున్నారు.

రేపటినుంచి అంగన్‌వాడీల్లో ఒంటిపూట తరగతులు

చందుర్తి (వేములవాడ) : వేసవిని దృష్టిలో ఉంచుకొని అంగన్ వాడి కేంద్రాలను ఒంటిపూట నడిపించేందుకు ఐసీడీఎస్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు సీడీపీవో ఎల్లయ్య తెలిపారు. మండల కేంద్రంలో విలేకరులతో సీడీపీవో మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఒంటిపూట తరగతులు కొనసాగుతాయన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

వేములవాడరూరల్: మండలంలోని ఫాజుల్‌నగర్ వద్ద ప్రమాదకర మూలమలుపు ఉండడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారుల ప్రమాదాలను నివారించేందుకు ఎస్‌ఐ నాగరాజు ప్రత్యేకంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గతంలో ఈ కల్వర్టు, మూలమలుపు వద్ద ప్రమాదం జరిగి ఇద్దరు మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్డు వెంట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

సిరిసిల్లక్రైం : బాలలకు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని షీటీం ఎస్‌ఐ ప్రేమ్‌దీప్ అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో పట్టణంలోని పెద్దబోనాల కస్తూర్బాగాంధీ పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళలు హక్కులు, రక్షణకు షీటీం కృషి చేస్తుందన్నారు. వేధింపులకు పాల్పడినా, ర్యాగింగ్ చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలి

గంభీరావుపేట(సిరిసిల్ల): సిరిసిల్లలో నవీన్ అనే నిరుద్యోగ యువకుడి ఆత్మహత్యకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం గంభీరావుపేట మండలకేంద్రంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రధాన రహదారిపై బైఠాయించి కేటీఆర్‌కు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇక్కడ మండలశాఖ అధ్యక్షులు హమీద్, ఎంపీటీసీ పర్శరాములు, నాయకులు లచ్చయ్య, ప్రభాకర్, ఎల్లారెడ్డి, సత్యం, భాస్కర్, నర్సింలు, నుస్రతుల్లా, తాహెర్, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల నిరసన

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ప్రత్యేక తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని ఆశించిన యువత ఉద్యోగాలు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, సీఎం కేసీఆర్ పట్టించుకున్న పాపాన పోలేదని జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మునిగెల రాజు అన్నారు. శనివారం ఆయన నాయకులతో కలిసి మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఉద్యోగాలు రాక ఆత్మహత్యలు చేసుకున్న లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన విష్ణు, సిరిసిల్లకు చెందిన నవీన్‌వి ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. పేపర్ లీకేజీకి బీఆర్‌ఎస్ మంత్రులు బాధ్యత వహించి తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్, మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ళ భరత్ గౌడ్, నాయకులు ఆరెపెల్లి బాలు, శ్రీనివాస్, ఎడ్ల తిరుపతి, కొంపెల్లి శ్యాం పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు

రుద్రంగి: 2022–23 సంవత్సరానికి చెందిన మైనార్టీ వెల్ఫేర్ యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు దారులకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాలోతు శంకర్, బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించారు. 26 మంది దరఖాస్తుదారుల హాజరైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో సుధాకర్, ఏపీఎం, రుద్రంగి యూనియన్, కేడీసీసీ బ్యాంకుల ఫీల్డ్ ఆఫీసర్లు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో లబ్ధిదారుల ఎంపిక కోసం శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 326 దరఖాస్తులకు గాను 308 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీవో చిరంజీవి తెలిపారు.

21న ..

మండలంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 21 ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.

18 మంది హాజరు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలో ఉన్న మైనార్టీ యువతీ యువకులకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రుణాలపై మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. రెండు యూనిట్లకు 18 మంది హాజరైనట్లు ఎంపీడీవో రాంరెడ్డి తెలిపారు. సూపరింటెండెంట్ రమేశ్, ఐకేపీ ఏపీఎం చంద్రయ్య పాల్గొన్నారు.


రుద్రంగి: ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో, బ్యాంకు అధికారులు

రేపు..

సిరిసిల్లటౌన్: మైనార్టీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులకు అందించే రుణాలకోసం సోమవారం సిరిసిల్లలోని సినారె ఆడిటోరియంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

20న..

కోనరావుపేట: మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 20న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సోమవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో హాజరువాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లటౌన్: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై శనివారం సిరిసిల్ల కార్మిక భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇస్తామన్న గౌరవ వేతనాలు ఇవ్వాలని, మెస్ మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. నాయకులు సామల మల్లేశం, పంతం రవి, అజ్జ వేణు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

సిరిసిల్లఅర్బన్: సీఎం కేసీఆర్, కేటీఆర్‌పై అనుచిత వాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు హెచ్చరించారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీకి ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేకున్నా బీజేపీ కాంగ్రెస్ నాయకులు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ విషయంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయడం సరికాదనిన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు సురభి నవిన్‌రావు, కొయ్యాడ రమేశ్, మసిరెడ్డి అవినాష్‌రెడ్డి, చిలివేరి చిరంజీవి, బూర యాదగిరి, ఎల్లం, నల్లగొండ ప్రవీణ్, చక్రపాణి తదితరులున్నారు.


బావి చుట్టూ కంచె ఏర్పాటు


బావి చుట్టూ కంచె ఏర్పాటు చేసిన పంచాయతీ సిబ్బంది

సాక్షి స్పందన

వేములవాడ రూరల్: మండలంలోని వట్టెంలలో ప్రధాన రోడ్డు పక్కన ఉన్న బావి ప్రమాదకరంగా ఉన్న విషయంపై సాక్షి దినపత్రికలో శనివారం ‘ప్రమాదకర బావి.. ‘పట్టించుకోని అధికారులు’ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ స్పందించారు. వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసి బావి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై మండల అధికారులు, పోలీస్ శాఖ సంఘటనా స్థలానికి వెళ్లి బావిని పరిశీలించారు. సర్పంచ్ యామ సుమతి సూచనల మేరకు బావిచుట్టూ సిబ్బందితో కంచె ఏర్పాటు చేశారు.

బోయినపల్లి ఎస్సైగా పర్శరాం



బోయినపల్లి: బోయినపల్లి ఎస్సైగా బోయిని పర్శరాం శనివారం సాయంత్రం పదవి బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన ఎస్సై పుల్లా అభిలాష్ గంగాధర పీఎస్‌కు బదిలీకాగా సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న పర్శరాంను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

రాజీనామా

ఇల్లంతకుంట: మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఐరెడ్డి మహేందర్‌రెడ్డి శనివారం రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్లే మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తాను అధ్యక్ష పదవికి మాత్రమే రాజీనామా చేశానని, పార్టీలోనే కొనసాగనున్నట్లు పేర్కొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలి

గంభీరావుపేట: గుడిసెల్లో నివసిస్తున్న వారందరికీ వెంటనే డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు వర్దవెల్లి స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం.. తుర్కాశీపల్లె గ్రామాన్ని శనివారం బీఎస్పీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అరవై ఏళ్లుగా పూరి గుడిసెలో జీవనం సాగిస్తున్నా ప్రభుత్వం వీరిని ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రేషన్ సరుకులు అందడం లేదని, మురికి కాలువల నిర్మాణం చేపట్టలేదని గ్రామస్తులు బీఎస్పీ నాయకులతో వాపోయారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు నీరటి భాను, నాయకులు హైదర్, లక్ష్మీరాజం, సాయిచంద్, లింగాల నిలేష్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: సీపీఎం చేపడుతున్న జనచైతన్య యాత్ర పోస్టర్లను ఆపార్టీ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ ఆవిష్కరించారు. శనివారం సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల17న జనచైతన్య యాత్ర వరంగల్‌లో ప్రారంభించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర సర్కార్ల ప్రజా వ్యతిరేక విధానాలపై అవగాహన కల్పిస్తూ యాత్ర సాగుతుందన్నారు. ఈనెల 26న సిరిసిల్లకు చేరుకుంటుందని అన్నివర్గాల ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. కోడం రమణ, సూరం పద్మ, మోర అజయ్, ఎలిగేటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

కోనరావుపేట: గ్రామీణ పేదల సంఘం ఆరవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు తాటిపాముల శ్రీనివాస్ కోరారు. మహాసభల పోస్టర్‌ను మండలం మరిమడ్లలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలను సిద్దిపేట జిల్లా కృష్ణాబాద్‌లో ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు, పేదల సంఘం నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు జింక శ్రీనివాస్, కుమ్మరి దిలీప్‌కుమార్, పుల్కం మల్లేశం, చెర్ల మల్లేశం, సక్కుబాయి, నాగమణి, రాజవ్వ, మహంకాళి శ్రీనివాస్, సుంకటి రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేస్తున్న డీఈవో

గంభీరావుపేట (సిరిసిల్ల): పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి రమేశ్ అన్నారు. మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం సందర్శించారు. హైదరాబాద్ చిలుకూరు బాలాజీ దేవస్థానం ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం పంపించిన పెన్నులను డీఈవో విద్యార్థులకు పంపిణీ చేశారు. డీఈవో వెంట కేజీబీవీ ప్రత్యేకాధికారి వసంత, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

గంభీరావుపేట: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీల వర్గీకరణ బిల్లుపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27, 28 తేదీల్లో చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ కానాపురం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు.

సమయాన్ని వృథా చేయొద్దు

రుద్రంగి: పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదవాలని ప్రధానోపాధ్యాయుడు అంబటి శంకర్ అన్నారు. శనివారం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పది పరీక్షలు మరో 15 రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

గడువు పెంపు

సిరిసిల్లఅర్బన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు గడువును ఈనెల 20 వరకు వరకు పొడగించినట్లు జిల్లా సమన్వయ అధికారిణి బి. జాక్విలిన్ ఒక ప్రకటనలో తెలిపారు.